క్లుప్తంగా

'ఆడుదాం ఆంధ్రా' క్రికెట్ విజేత పెద్దమక్కెన



సత్తెనపల్లి: ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో పోటీల్లో భాగంగా గుడిపూడి– పెద్దమక్కెన అంబేడ్కర్ సీసీ జట్ల మధ్య క్రికెట్ ఫైనల్ పోటీలు నిర్వహించారు. పెద్దమక్కెన అంబేడ్కర్ సీసీ జట్టు విజయకేతనం ఎగురవేసింది. సత్తెనపల్లి మండలం కొమెరపూడిలో కొమెరపూడి, నందిగామ, ఫణిదం, బృగుబండ జట్ల మధ్య పోటీ జరగనుంది. అంబేడ్కర్ సీసీ జట్టును పీడీ లాకు పిచ్చయ్య, వలంటీర్ సురేష్, తదితరులు అభినందించారు.

ముప్పాళ్లలో ఉచిత వైద్య శిబిరం



ముప్పాళ్ల: మండల కేంద్రమైన ముప్పాళ్లలోని ఆర్ఎంపీ శ్రీనివాసమూర్తి ఆస్పత్రిలో నరసరావుపేటకు చెందిన నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆస్పత్రి నిర్వాహకులు, వైద్యులు నెల్లూరి రమేష్ పాల్గొని 180 మందికి వైద్యసేవలందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ప్రతి ఒక్కరికీ మొక్కను అందించారు.

ఇరుకుపాలెంలో ఈవీఎంలపై అవగాహన



ఇరుకుపాలెం(ముప్పాళ్ల): మండలంలోని ఇరుకుపాలెం, రామకృష్ణాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరుపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం డీటీ లక్ష్మీప్రసాద్ ఆదివారం నిర్వహించారు. ఓటర్లు ఈవీఎం మిషన్‌లో ఏ గుర్తుపై వేశారో వీవీప్యాట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. పోలింగ్ సిబ్బంది సమక్షంలోనే ఓటు వేయాలని, ఒక్కరు ఒకసారి మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్.ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

సేవా రత్న పురస్కారాన్ని అందుకున్న రవికుమార్



సత్తెనపల్లి: సమాజంలో విశిష్ట సేవలందించిన సత్తెనపల్లి వాసవి సేవా సమితి అధ్యక్షుడు దేవరశెట్టి రవికుమార్ దంపతులు సేవారత్న పురస్కారాన్ని అందుకున్నారు. నరసరావుపేటలో వాసవి సేవా సమితి సిల్వర్ జూబ్లీ మహోత్సవాల సందర్భంగా సిల్వర్ జూబ్లీ కమిటీ వారు దేవరశెట్టి రవికుమార్ దంపతులను ఎంపిక చేయగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సిల్వర్ జూబ్లీ వ్యవస్థాపకులు చీతిరాల గురుపెద్దన్న, సిల్వర్ జూబ్లీ కమిటీ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి గోవర్ధన్ చేతుల మీదుగా సేవా రత్న పురస్కారాన్ని ఆదివారం అందుకున్నారు. రవికుమార్ దంపతులను పలువురు అభినందించారు.

పొగాకు పంట అధిక దిగుబడిపై అవగాహన



వినుకొండ(నూజెండ్ల) : పొగాకు సాగులో అధిక దిగుబడితో పాటు లాభాలు సాధించే విధంగా సీటీఆర్ఐ ప్రభుత్వ సంస్థ, జీపీఐ సంస్థ సంయుక్తంగా శాస్త్రవేత్తలతో రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నట్లు సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్ పేర్కొన్నారు. వినుకొండ రూరల్ బ్రాహ్మణపల్లిలో పొగాకు పంటను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం మార్కెట్‌లో పొగాకు అవసరం మరింతగా పెరిగిందని, దానికి అనుగుణంగా రైతులను పొగాకు పంట సాగులో సస్యరక్షణ చర్యలు తెలియజేస్తున్నామన్నారు. అధికదిగుబడులు, అధిక లాభాలు వచ్చేలా సీటీఆర్ఐ సంస్థ జీపీఐ సంస్థతో కలిసి సంయుక్తంగా కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ సి.చంద్రశేఖరరావు, జీపీఐ మేనేజర్ జి.రమేష్‌రాజు, వినుకొండ ఏరియా బ్రాంచి మేనేజర్ సీహెచ్ వీరారెడ్డి, మేనేజర్ గోవిందు వినయ్ పాల్గొన్నారు.

మంచి చేసిన జగనన్నకు అండగా నిలవాలి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



ధరణికోటలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: పేద ప్రజలకు నిరంతరం మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. మండల పరిధిలోని లేమల్లె, ధరణికోట గ్రామాల్లో రూ.3 వేలకు పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుకను ఆదివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నంబూరు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ రూ.3 వేలకు పెంచారన్నారు. చేయూత, అమ్మఒడి, రైతుభరోసా, విద్యాదీవె, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యేలా చేశారన్నారు. టీడీపీ చెప్పినట్టు ఎన్నికల ముందు ఒకలా, ఎన్నికల తర్వాత మరోలా తాము మాట్లాడడం తమకు రాదన్నారు. ఎన్నికల హామీల్లో చెప్పిన మాటను ప్రకారం అమలు చేసిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అన్నారు. నియోజకవర్గంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిలో కూడా అందరి కంటే ముందున్నామని చెప్పారు. అమరావతి– బెల్లంకొండ డబుల్ లైన్ రోడ్డు, అమరావతి– తుళ్లూరు డబుల్ లేన్ రోడ్డు, మాదిపాడు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మిస్తున్నామని వెల్లడించారు. బ్రిడ్జి నిర్మాణంతో అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ మండలాలు వేగంగా అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కోట హరిబాబు, క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ హష్మీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, వ్యవసాయ సలహామండలి మండల అధ్యక్షుడు ఆలపాటి వీరయ్య, లేమల్లె, ధరణికోట సర్పంచులు ఉగ్గం పున్నమ్మ, మాదాసు పావని, ఎంపీటీసీలు నాగుల్‌మీరావలి, శాంతమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు చిల్కా సాంబయ్య, ఆళ్ల శ్రీనివాసరెడ్డి, కొండవీటి కోటేశ్వరరావు, మాదాసు రాంబాబు, నాగరాజు, సరిపూడి శివయ్య, దాసు, లేమల్లె నాయకులు ఉగ్గం యలమందయ్య, బంధంరావూరి శ్రీనివాసరావు, సైదావలి, వెంకట్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

- ముగిసిన గ్రామ, వార్డు స్థాయి వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు
- నేటి నుంచి మండల స్థాయి ముగ్గుల పోటీలు



పట్టణంలోని 31వ వార్డులో ముగ్గుల పోటీల్లో మహిళలు

సత్తెనపల్లి: నియోజకవర్గంలో నిర్వహిస్తున్న వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇళ్ల ముందు కూడా రంగురంగుల ముగ్గులు ఆకట్టుకుంటున్నాయి. తమ సృజన నైపుణ్యాలను ప్రదర్శిస్తూ రంగురంగుల ముగ్గులు వేస్తున్నారు.

ఇంటి ముంగిట కళకళలాడే ముగ్గులు...

సాధారణంగా ధనుర్మాసం నుంచి ఇళ్ల ముందు ముగ్గులు కళకళలాడుతాయి. సంక్రాంతి వరకు ఇళ్ల లోగిళ్లలో ముగ్గులు తీర్చిదిద్దుతారు. రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో మహిళల ప్రోత్సహించటం కోసం ప్రత్యేకంగా వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు 2018 నుంచి సంప్రదాయంగా నిర్వ హిస్తూ నగదు బహుమతులను అందజేస్తున్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా సత్తెనపల్లి నియోజకవర్గంలో ఈ నెల 3 నుంచి 6 వరకు చేపట్టిన గ్రామ పంచాయతీ/మున్సిపల్ వార్డు స్థాయి ముగ్గుల పోటీలు ముగిశాయి. సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన, బీమవరం, నకరికల్లు మండలం జిల్లా పేట తండా, పట్టణంలోని 31వ వార్డులో ఆదివారం నిర్వహించటంతో గ్రామ/వార్డు స్థాయి పోటీలు ముగిశాయి. గ్రామ/వార్డు స్థాయిలో విజేతలను ఎంపిక చేసి వారికి బహుమతులు పంపిణీ చేయనున్నారు.

పది వరకు మండలస్థాయిలో..

సోమవారం నుంచి మండల/మున్సిపాలిటీ స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 10 వరకు ఈ పోటీలు జరుగనున్నాయి. ఈ నెల 8న నకరికల్లు, 9న ఉదయం ముప్పాళ్ల, సాయంత్రం రాజుపాలెం, 10న ఉదయం సత్తెనపల్లి టౌన్, సాయంత్రం సత్తెనపల్లి రూరల్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల్లోని 25 మంది విజేతలకు ఈనెల 12న సంక్రాంతి సంబరాల్లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందించనున్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానానికి రూ.2 లక్షలు, ద్వితీయస్థానానికి రూ.లక్ష, తృతీయ స్థానానికి రూ.50 వేలు, నాలుగో స్థానానికి రూ.25 వేలు, ఐదో స్థానానికి కన్సోలేషన్ బహుమతి అందించనున్నారు.

12,916 మంది మహిళలు భాగస్వాములు..

వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలు ఈ నెల 3 నుంచి ప్రారంభం కాగా గ్రామ పంచాయతీ/మున్సిపల్ వార్డు స్థాయిలో 12,916 మంది మహిళలు పోటీల్లో భాగస్వాములయ్యారు. ఈ ఏడాది మరింత రెట్టింపు ఉత్సాహంతో మహిళలు పోటీల్లో పాల్గొనడం విశేషం. అత్యధికంగా సత్తెనపల్లి రూరల్ మండలంలో 3,793 మంది మహిళలు పోటీల్లో భాగస్వాములయ్యారు.

భక్తి శ్రద్ధలతో ధనుర్మాస పూజలు

పూజల్లో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు



మంత్రి అంబటికి స్వాగతం పలుకుతున్న ఆలయ నిర్వాహకులు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రీవెంకటేశ్వర స్వామిని చందనంతో అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్ పూజల్లో పాల్గొన్నారు. శ్రీవారి సేవా సమాజం ఆధ్వర్యంలో మంత్రి అంబటి రాంబాబుకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కండువాను కప్పి ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా వివిధ రూపాలతో కూడిన కళాకారులతో స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్ లోని దేవాలయం వద్ద నుంచి పురవీధుల్లో కనకతప్పట్లు, మేళతాళాలతో గ్రామోత్సవం వైభవంగా సాగింది.

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి

అమరావతి: రానున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తోందని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని దిడుగు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ వింతా శివనాగి రెడ్డి, పార్టీ నాయకులు వింతా బ్రహ్మానంద రెడ్డి, పోరెడ్డి శివరామిరెడ్డి, గాలి విగ్నేశ్వర్ రెడ్డి, కె.విజయభాస్కర్ రెడ్డి, డి.బాజీ, వి.వీరారెడ్డి, ఎం.శివశంకర్, ఎస్.వెంకట శివారెడ్డి, కె.శ్రీనివాస రెడ్డి, కె.శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఇస్తేమాకు తరలిన ముస్లింలు

క్రోసూరు: తెలంగాణ రాష్ట్రం వికారాబాద్ జిల్లాలోని పరిగి మండలంలో జరుగుతున్న ముస్లిం మతబోధనల కార్యక్రమానికి(ఇస్తేమా) క్రోసూరు నుంచి శనివారం రాత్రి తరలివెళ్లారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఏర్పాటు చేసిన బస్సులో ముస్లిం తరలి వెళ్లారు. వచ్చే మంగళవారంతో ఇస్తేమా ముగుస్తుందని మత పెద్దలు తెలిపారు.

మహిళల్లో చైతన్య నింపేందుకే ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తున్న పోతులూరయ్య, తిప్పర్తి మధులత

సత్తెనపల్లి: మహిళల్లో చైతన్య నింపేందుకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు కోటగిరి పోతులూరయ్య అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో కెనరా బ్యాంక్ సమీపంలో విశ్వబ్రహ్మణ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు తిప్పర్తి మధులత ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. పోటీలకు 30 మంది హాజరయ్యారు. ప్రథమ స్థానం సుంకర సరస్వతి సుష్మ భవాని, ద్వితీయ స్థానం కల్లూరి మల్లేశ్వరి, తృతీయ స్థానం వంగిపురపు హైమ, నాలుగో స్థానం కోటగిరి శ్రావణి, ఐదో స్థానం సుంకర రాజేశ్వరి కై వసం చేసుకున్నారు. అనంతరం పోటీలో పాల్గొన్న ప్రతి మహిళలకు ప్రోత్సాహక బహుమతిని అందించారు.

యోగాతో ఒత్తిడి నియంత్రణ



పట్టణంలోని ఏఎంసీ ఆవరణలో యోగా ఆసనాలు వేస్తున్న యోగా గురువు ముత్తినేని శ్రీనివాసరావు

సత్తెనపల్లి: మానసిక, శారీరక ఒత్తిడికి యోగానే దివ్య ఔషధం అని యోగా గురువు, ఉపాధ్యాయుడు ముత్తినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఉచిత యోగ శిక్షణ కేంద్రం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మనిషి జీవితం యాంత్రిక మయమైందని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో జీవనం ఉరుకులు పరుగుల మధ్య సాగుతుందన్నారు. ప్రతి ఒక్కరిలోనూ వృత్తి, వ్యక్తిగత ఒత్తిళ్లు అధికమయ్యాయని చెప్పారు. కాలుష్యం వల్ల అనేక రుగ్మతులతో బాధపడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటికీ కాస్త ఉపశమనం పొందాలంటే యోగానే సరైన సాధన అన్నారు. తద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ఈ ప్రాధాన్యతను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాను ప్రజలకు చేరువ చేయనున్నాయన్నారు. యోగ ఆరోగ్యానికి దివ్య ఔషధంగా ఉంటుందని, ఒత్తిడి దూరం అవుతుందన్నారు. ఎలాంటి సమస్యకైనా చక్కటి పరిష్కారం చూపించే యోగాను ప్రతి ఒక్కరూ కొనసాగించాలన్నారు. యోగాతో ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్పీ ప్రసాదరాజు, మాతంగి సాంబశివరావు, కేబీఆర్‌జే ప్రసాద్, బెల్లంకొండ రమేష్, గౌస్, ఆవుల సురేష్, గరీబుల్, హనుమాన్ నాయక్, రాహుల్ గౌతమ్, భావనారుషి, ధారా జాషువా పాల్గొన్నారు.

నేడు నిర్వాసితులకు రిజిస్ట్రేషన్ దస్తావేజులు అందజేత

రాజుపాలెం: మండల కేంద్రంలోని రాజుపాలెం పులిచింతల నిర్వాసిత కేంద్రంలో సోమవారం ఉదయం 11 గంటలకు పట్టాల రిజిస్ట్రేషన్ దస్తావేజులు లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు ఎ.నళిని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారని చెప్పారు. పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి పాల్గొంటున్నట్లు తెలిపారు.

రాహు కేతువులకు విశేషపూజలు

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడులోని అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో రాహు– కేతుపూజలు ఘనంగా నిర్వహించారు. రాహు కేతులకు పూజలు చేసేందుకు ఆదివారం అనువైన రోజు కావడంతో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు చేశారు.

శనగలో తుప్పు తెగులును నివారించుకోవాలి

మాదల(ముప్పాళ్ల): శనగ పంటలో తుప్పు తెగులు ఆశిస్తుందని, రైతులు వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని డాట్‌సెంటర్ నరసరావుపేట శాస్త్రవేత్తలు సీహెచ్ వరప్రసాదరావు, రమేష్ సూచించారు. మండలంలోని మాదల గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో బాపట్ల వ్యవసాయకళాశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో శనగ, మిరప పంటలపై సస్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు.

పండగలా పింఛన్ల పంపిణీ



పట్టణంలోని 12వ వార్డులో పింఛన్ పంపిణీ చేస్తున్న లోకా మాధవ



పట్టణంలోని 13వ వార్డులో పింఛన్ పంపిణీ చేస్తున్న బండి మల్లి ఖార్జున రెడ్డి



పట్టణంలోని 19వ వార్డులో పింఛన్ పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు

సత్తెనపల్లి: పట్టణంలో పండగ వాతావరణంలో వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు వలంటీర్లు పంపిణీ చేస్తున్నారు. మరోవైపు స్వస్థలాలకు దూరంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి వద్దకు కూడా వలంటీర్లు నేరుగా వెళ్లి పింఛన్ అందిస్తున్నారు. పింఛన్ రూ.3 వేలకు పెంచుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం తీసుకోవడంతో పింఛన్ పెంపు వారోత్సవాల్లో భాగంగా శనివారం నుంచి పట్టణంలో పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలో మొత్తం పింఛన్లు 6,430 ఉండగా కొత్త పింఛన్లు 108 మంజూరయ్యాయి. మొత్తం 6,538 పింఛన్లుకు గాను ఆదివారం నాటికి 3,990 మంది పింఛను దారులకు నగదు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్లు లోకా కల్యాణి, బండి రాజ్యలక్ష్మి, అవ్వారు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు లోకా మాధవ, బండి మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

నేడు పెదకూరపాడు తిరునాళ్ల



విద్యుత్ కాంతులతో శోభిల్లుతున్న ముగ్గురు రాజుల దేవాలయం

పెదకూరపాడు: నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడు ముగ్గురు రాజుల తిరునాళ్లకు సర్వం సిద్ధమైంది. తిరునాళ్ల సందర్భంగా ముగ్గురు రాజుల దేవాలయం విద్యుత్ దీపాలతో వెలుగిపోతోంది. అమరావతి– సత్తెనపల్లి రహదారి పై సందడి వాతావరణం నెలకొంది. గత 26 సంవత్సరాలుగా అత్యంత వైభవంగా మహోత్సవం నిర్వహిస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాలతో పాటు జిల్లాలో పలు గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బాలయేసును సందర్శించి మొక్కులు తీర్చుకుంటారు.

ఈ సందర్భంగా మోన్‌సిగ్నోర్ విచారణ గురువులు పాదర్ రెవరెండ్ పుట్టి సుందరరాజు మాట్లాడుతూ తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు తెలిపారు. పండుగ సందర్భంగా దివ్యపూజబలిని చిలకలూరిపేట విచారణ గురువులు గురుశ్రీ పెట్ల మరియ దాసు, నంబూరు విచారణ గురవులు, పాస్టర్ సెంటర్ డైరెక్టర్ గురు శ్రీ పూదోట చిన్నయ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కొవ్వత్తుల, కానుకల సమర్పణ, రాత్రి 9 గంటలకు బాణసంచాలతో గ్రామ వీధుల్లో తేరు ప్రదక్షించబడుతుందన్నారు. రంగుల రాట్నం, దుకాణాలు పెట్టుకునేందుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించినట్లు తెలిపారు. సీఐ వీరస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్త్ నిర్వహించనున్నట్లు సుందరరాజు పేర్కొన్నారు.

నిరుపేద బ్రాహ్మణులకు బియ్యం, వస్త్రాలు పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని జీవీ మాధవరావు కార్యాలయంలో ఆరు నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో బియ్యం, నూతన వస్త్రాలు ఆదివారం అందజేశారు. రాష్ట్ర సచివాలయ విభాగ కమిషనర్ ఎ.రాధాకృష్ణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనను సమితి సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో చింతలచెర్వు రాఘవేంద్రరావు, ఉల్లగంగి మల్లికార్జునరావు, జె.చంద్రమౌలేశ్వర శాస్త్రి, దారా రామ్మూర్తి, చింతలపూడి సుబ్బారావు, ఆదిచంద్ర, శ్రీనివాసరావు, మధుసూదనరావు, ఎం.వి.శర్మ, భువనగిరి సుబ్రమ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు ప్రతిభ పరీక్ష



మొమెంటోలు, ప్రశంస పత్రాలతో విద్యార్థులు

శావల్యాపురం: పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగినేని రాఘువ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్షను సుచరిత ఏడ్యుకేషనల్ సొసైటీ, గంగినేని ఫౌండేషన్ ప్రతినిధులు సంయుక్తంగా నిర్వహించారు. గంగినేని రాఘవ మాట్లాడుతూ ఇలాంటి ప్రతిభ పరీక్షల్లో పాల్గొంటే విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో భయాందోళనలు చెందకుండా ఉంటారని పేర్కొన్నారు. వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మర్రి యశోదర్, పొత్తూరి భువనసాయి సుభాష్, మానం హేమంత్ మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. కన్సోలేషన్ బహుమతులను శావల్యాపురం హైస్కూలు విద్యార్థి డి.వీరచందు, పోట్లూరు పాఠశాల విద్యార్థి జి.రాధేశ్వర్ పొందారు. ప్రశంసా పత్రాలు అందజేశారు. సుచరిత ఏడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చందు, అజిత్‌చందు, ఉపాధ్యాయులు గురుబాబు, శ్రీనివాసరాజు, వసంతరావు, శ్రీనివాసరావు, రాగుల రాధాకృష్ణమూర్తి, లోమడ చెన్నబాబు, శ్రీనివాససింగ్ పాల్గొన్నారు. మండలంలోని ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 173 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

వేసవికి గొంతెండదు..!

- జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.23కోట్లతో తాగునీటి సరఫరా
- టెండరు దశ పూర్తి, పండగ తర్వాత పనులు ప్రారంభం



జలజీవన్ మిషన్ పథకంలో పనులు పరిశీలించుతున్న అధికారులు

శావల్యాపురం: జలజీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు శుద్ధి చేసిన తాగు నీటిని కొళాయిలు ద్వారా ప్రభుత్వాల అందిస్తున్నాయి. ఇందులో భాగంగా వినుకొండ నియోజకవర్గంలో నాలుగు మండలాలకు రూ. 23 కోట్ల నిధులు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఏస్ డీఈ ఫణిదపు శంకరబాబు తెలిపారు. ఎంపికైనా గ్రామాల్లో నిధులకు సంబంధించి, టెండరు దశ కూడా పూర్తి అయ్యిందని ఆయన చెప్పారు. ఈపూరు మండలంలో ఆరు గ్రామాలకు గాను రూ. 2.58కోట్లు, నూజెండ్ల మండలంలో 11 గ్రామాలకు రూ. 5.04కోట్లు, శావల్యాపురం మండలంలో ఆరు గ్రామాలకు రూ. 5.26 కోట్లు, వినుకొండ రూరల్ మండలంలో 22 గ్రామాలకు రూ.10.62కోట్ల నిధులు మంజూరు అయినట్లు డీఈ వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో ఎంపికైన గ్రామాల్లో సంక్రాంతి పండుగ అనంతరం పనులు ప్రారంభిస్తామన్నారు. నిధులు ఆధారంగా అవసరమైన చోటు ఓవర్ హెడ్ ట్యాంకులతో పైపులైను నిర్మాణ పనులతో ఇంటింటి నీటి కొళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. నాలుగు నుంచి ఆరు నెలల లోపుల పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టామన్నారు.

జనరిక్ మందుల దుకాణాలకు అనుమతులు

శావల్యాపురం: మండలంలోని శావల్యాపురం, వేల్పూరు గ్రామాల్లో జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు అనుమతులు మంజూరైనట్లు శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య తెలిపారు. ఢీల్లీలో జరిగిన సదస్సులో అనుమతి పత్రాలు ఆదివారం అందుకున్నట్లు చెప్పారు. అలాగే కేంద్ర హోం శాఖ మంత్రి అమిషాతో సోమవారం జరిగే సదస్సులో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో సొసైటీ సీఈవో జాలాది నాగ ప్రసాదు, సిబ్బంది రామాంజినేయులు పాల్గొన్నారు.

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులో జనరిక్ మందుల దుకాణం త్వరలో ప్రారంభించనున్నట్లు ఈపూరు సొసైటీ చైర్మన్ బొల్లా బుజ్జి ఆదివారం తెలిపారు. ఢీల్లీలో జరుగుతున్న సదస్సులో ఈపూరు సహకార సంఘానికి జనరిక్ మందుల దుకాణం మంజూరుకు కేంద్ర ప్రభుత్వం అధికారంకగా కోడ్ ప్రకటించినట్లు తెలిపారు. త్వరలో ఈపూరు ప్రధాన కూడలి మార్గంలో జనరిక్ మందుల దుకాణాన్ని ప్రారంభిస్తామన్నారు. సీఈఓ పోకా కోటేశ్వరరావు ఉన్నారు.